క్లుప్తంగా

అమ్మవారి సేవలో మంత్రి కొల్లు రవీంద్ర



అమ్మవారి సేవలో మంత్రి కొల్లు రవీంద్ర

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర గురువారం దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ సూపరింటెండెంట్ శేషగిరి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు .

స్థానికులకు ప్రతి మంగళవారం శ్రీవారి దర్శనం కల్పించాలి



మాట్లాడుతున్న చింతా మోహన్

తిరుపతి(అలిపిరి): తిరుపతిలో నివాసం ఉంటున్న స్థానికులకు ప్రతి మంగళవారం తిరుమల శ్రీవారి ప్రత్యేక దర్శనం కల్పించాలని మాజీ కేంద్ర మంత్రి చింతా మోహన్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక టీటీడీ పరిపాలనా భవనం ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో బాపిరాజు చైర్మన్‌గా ఉన్న సమయంలో స్థానికులకు ప్రతి మంగళవారం ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారని తెలిపారు. అదేవిధంగా వచ్చే నెల నుంచి ఆధార్ కార్డు ఉన్న స్థానికులకు అవకాశం కల్పించాలని కోరారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



విద్యా సామగ్రి అందజేస్తున్న సర్పంచ్ సింహోల విమలమోహన

భాకరాపేట: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు అని జంగావాండ్లపల్లె గ్రామ సర్పంచ్ సింహోల విమల మోహన పేర్కొన్నారు. చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా సామగ్రిని గురువారం విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ నాడు–నేడు కింద పాఠశాలల రూపురేఖలు మారాయన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదివి అత్యున్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రాచ్య పరిశోధన సంస్థకు ఏసీ బహూకరణ



ఏసీ అందజేస్తున్న ప్రవాస భారతీయుల ప్రతినిధులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ ప్రాచ్య పరిశోధన సంస్థకు ప్రవాస భారతీయులు ఏసీ యూనిట్‌ను బహూకరించారు. జార్జియాలో స్థిరపడ్డ ప్రవాస భారతీయులు సెరినిటీ ఇన్ఫోటెక్ అధినేత శ్రీనురెడ్డి, విజన్ ఇన్ఫోటెక్ ఉపేంద్రరెడ్డి, సీవిజన్ అధినేత రాజశేఖర్‌రెడ్డి ఎస్వీ యూనివర్సిటీలోని ప్రాచ్య పరిశోధనా సంస్థను గత నెల ఒకటో తేదీన సందర్శించారు. సంస్థలో భద్రపరచబడిన ప్రాచీన రాతప్రతులను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. తాళపత్ర, కాగిత ప్రతుల్లో నిక్షిప్తమైన జ్ఞాన సంపదను, లిపులను, అందమైన అక్షరాలుగా తీర్చడంలో ప్రాచీనుల నైపుణ్యాన్ని తెలుసుకున్నారు. ప్రాచీన జ్ఞాన సంపద సంరక్షణకు తమ వంతు కృషి చేస్తామని గతంలో హామీ ఇచ్చారు. అందులో భాగంగా గురువారం వారి ప్రతినిధులు విజయ్‌భాస్కర్‌రెడ్డి, సుందర్ ద్వారా ఓఆర్‌ఐ సంచాలకులు పీజీ వెంకటేశ్వర్లకు ఖరీదైన రెండు టన్నుల సామర్థ్యం గల ఏసీని అందజేశారు.

ప్రభుత్వ భూమిపై టీడీపీ నేతల కన్ను

- దళితులను అడ్డం పెట్టుకుని భూమి కాజేసేందుకు యత్నం
- అడ్డుకున్న రైతులు.. పోలీసులకు ఫిర్యాదు
- ప్రభుత్వ భూమిని కాపాడాలంటూ వేడుకుంటున్న రైతులు



ఆక్రమణదారులు చదును చేసిన కాలువ పోరంబోకు భూమి

చంద్రగిరి: 40 సంవత్సరాలుగా ఇరు గ్రామాల ప్రజలు వినియోగించుకుంటున్న భూమిపై టీడీపీ నేతల కన్ను పడింది. తొండవాడ రెవెన్యూ పరిధిలోకి రావడంతో ఆ భూమికి విపరీతమైన డిమాండ్ ఉంది. ఇన్నాళ్లూ సదరు భూమిని అక్రమించుకోవడానికి టీడీపీ నాయకులు ఎవరూ సాహసించలేదు. సార్వత్రిక ఎన్నికల ముగిసి టీడీపీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ నేతల కళ్లు ప్రభుత్వ భూమిపై పడ్డాయి. దీంతో దళితులను అడ్డుగా ఉంచి భూమిని కాజేయాలని ప్రయత్నించడంతో, పక్క గ్రామాల ప్రజలు అడ్డుకున్న ఘటన గురువారం తొండవాడ పంచాయతీలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు... తొండవాడ లెక్క దాఖల సర్వే నంబరు 859లో 9.28 ఎకరాల విస్తీర్ణంలో కాలువ పోరంబోకు ఉంది. ఈ భూమిని అటు తొండవాడ, ఇటు శానంబట్ల గ్రామాల రైతులు, ప్రజలు గత 40 సంవత్సరాలుగా దారికి ఉపయోగించుకుంటున్నారు. ఈ క్రమంలో దళితవాడకు చెందిన పరుశురాముడు, గంగుడుపల్లి మాతమ్మ, దేశమ్మ, వేణుగోపాల్ అనే వ్యక్తులు టీడీపీ నాయకుల ప్రోద్బలంతో ఆ భూమిలోని కొంత భాగంలో చదును చేసి జొన్నలు చల్లారు. ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతోందని తెలుసుకున్న శానంబట్లకు, తొండవాడకు చెందిన కొందరు రైతులు అదే భూమిలో మామిడి చెట్లను నాటారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య వివాదం చెలరేగింది. రంగంలోకి దిగిన టీడీపీ నాయకులు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుంటున్న వర్గానికి వత్తాసు పలుకుతూ రైతులను బెదిరింపులకు పాల్పడ్డారు. భూమిలోకి రైతులు రాకూడదంటూ టీడీపీ నేతలు హుకుం జారీ చేశారు. దారి వరకు తీసుకోవాలని, మిగిలిన భూమిని ఏమైనా చేసుకుంటామంటూ హెచ్చరించారు. దీంతో రైతులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఇరు వర్గాల వారితో మాట్లాడారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

పశువులకు జొన్నల సాగు పేరుతో కొంత మంది ప్రభుత్వ భూమిని ఆక్రమించుకునేందుకు చదును చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ కాలువ పోరంబోకును కబ్జా కోరల నుంచి కాపాడాలంటూ రెవెన్యూ అధికారులకు, స్థానిక వీఆర్‌ఓకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. రెవెన్యూ అధికారులకు భూమి కబ్జాపై ఫిర్యాదు చేసేందుకు ఫోన్ చేసినా, కాల్ లిఫ్ట్ చేయడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. కోట్ల రూపాయల విలువైన కాలువ పోరంబోకు భూమిని కబ్జా చేస్తున్నా, రెవెన్యూ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా రైతులు కోరినట్లుగా రెవెన్యూ అధికారులు కాలువ పోరంబోకు భూమిని కాపాడాల్సి ఉంది.



ఆక్రమిత ప్రభుత్వ భూమికి ముళ్లకంపలతో కంచె



ఘటనా స్థలంలో ఇరు వర్గాలను విచారిస్తున్న పోలీసులు

తక్షణమే బోర్డులు ఏర్పాటు చేస్తాం

కాలువ పోరంబోకు, బండి బాట, ఇతర ప్రభుత్వ భూములను ఆక్రమించాలని ప్రయతిస్తే ఉపేక్షించం. ఆక్రమణలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తాం. తొండవాడ రెవెన్యూ పరిధిలోని కాలువ పోరంబోకు స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటున్నాం. తక్షణమే ఆ భూమిలో ప్రభుత్వ బోర్డును ఏర్పాటు చేయాలని ఇప్పటికే సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం. కాలువ పోరంబోకు భూమికి యథావిధిగానే ఉంటుంది. ఎవరు నిబంధనలను అతిక్రమించినా శిక్ష తప్పదు.

– మారుతి, తహశీల్దార్

విద్యార్థులు జాబ్ ప్రొవైడర్స్‌గా ఎదగాలి



జాతీయ సెమినార్‌కు హాజరైన వీసీ, అధ్యాపకులు, విద్యార్థులు

తిరుపతి సిటీ: విద్యార్థులు జాబ్ ప్రొవైడర్స్‌గా ఎదగాలని ఈ విషయాన్ని ప్రధాని మోదీ సైతం యువతకు పిలుపునిచ్చారని పద్మావతి మహిళా వర్సిటీ వీసీ డి.భారతి పేర్కొన్నారు. గురువారం స్థానిక మహిళా వర్సిటీలో కంప్యూటర్ సైన్స్ విభాగం, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జరిగిన యాక్సిలరేటర్ ఇంక్యుబేషన్ అవర్చునిటీస్ ఎర్లీ స్టేజ్ ఎంటర్‌ప్రెన్యూర్ అనే అంశంపై జాతీయ సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో వర్సిటీలో ఇంక్యుబేటర్ సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు ఇంక్యుబేటర్ సెంటర్లను వినియోగించుకోవాలని ఆకాంక్షించారు. వర్సిటీలో చదువు పూర్తి చేసుకున్న విద్యార్థినులు పారిశ్రామిక వేత్తలుగా ఎదగి, సమాజానికి ఉపయోగపడుతూ మరికొంత మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. వేలూరు యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీస్ ప్రొఫెసర్ ఎం రాజశేఖర్ బాబు, ప్రొఫెసర్ వెంకటకృష్ణ, కంప్యూటర్ సైన్స్ హెడ్ ఉషారాణి, కె.చందన, అధ్యాపకులు, విద్యార్థులు హాజరయ్యారు

గంగిరెడ్డిపల్లిలో అంగన్‌వాడీ బడిబాట



అంగన్‌వాడీ బడిబాట చేపడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పావనిశ్రీ

రామచంద్రాపురం: మండలంలోని గంగిరెడ్డిపల్లిలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పావనిశ్రీ ఆధ్వర్యంలో గురువారం అంగన్‌వాడీ బడిబాట, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో అన్నిరకాల మౌలిక వసతులు ఉన్నాయని, 6 సంవత్సరాల్లోపు వయస్సు గల పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలలో కథలు, ఆటపాటలతో కూడిన విద్యతో పాటు పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో గంగిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు అరుణ, మారయ్య, అంగన్‌వాడీ సిబ్బంది శ్రావణి, దేశమ్మ, రాజేశ్వరి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



ఇంటి బయట తొట్టెలో నిల్వ ఉంచిన నీటిని తొలగిస్తున్న వైద్యాధికారులు


చంద్రగిరి: వర్షాకాలం సమీపిస్తున్న క్రమంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అప్రమత్తతో వ్యవహరిస్తే ఆరోగ్యకరంగా జీవించవచ్చునని పాకాల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. గురువారం మండల పరిధిలోని పనపాకం పంచాయతీ అంబేడ్కర్ కాలనీలో ఆయన వైద్య సిబ్బందితో కలసి పర్యటించారు. ఈ మేరకు దోమల నివారణ చర్యలు చేపట్టారు. తొట్టెలు, మురుగు నీటి గుంతలు మొదలైన వాటిలో నీటి నిల్వలు తొలగించి, అబేట్, పైరిత్రిన్ తదితర దోమల మందులను పిచికారి చేశారు. గ్రామస్తులతో పాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దోమల నివారణ, కుష్టు వ్యాధి, నీటి కాలుష్యంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. దోమలు పుట్టకుండా ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని, పరిసరాలలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని కోరారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నీరు కలుషితమై టైఫాయిడ్, కామెర్లు, డయేరియా మొదలైన వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య శాఖ డిప్యూటీ డెమో కిరణ్‌కుమార్, ఈశ్వరయ్య, అయ్యప్ప, ఏఎన్‌ఎంలు గౌరి, నాగ సుధారాణి, తేజస్విని ఎంఎల్‌హెచ్‌పీలు అమ్ములు, కుమారి, పి.కుమారి, రాజ్యలక్ష్మీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అలరించిన సప్తగిరి సంగీత సప్తాహం



తిరుపతి కల్చరల్: వేమన విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో గురువారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు ప్రముఖ సంగీత కళాకారులు ఆలపించిన భక్తి సంకీర్తనలు ప్రేక్షకులను అలరింపజేశాయి. మనోవికాస్, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల సంయుక్త ఆధ్వర్యంలో యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో నిర్వహిస్తున్న నిరివ్రామ సప్తగిరి సంగీత సప్తాహం గురువారంతో ఐదో రోజుకు చేరుకుంది. అపురూప వాగ్గేయకార వైభవం పేరుతో తొలుత శ్రీభద్రాచల రామదాస కీర్తనల గోష్టిగానం చేపట్టారు. అనంతరం విజయవాడకు చెందిన కేవీ.బ్రహ్మానందం బృందం, హైదరాబాద్‌కు చెందిన వారణాసి జ్యోత్స్న బృందం, హైదరాబాద్‌కు చెందిన సీహెచ్.కృష్ణవేణి బృందం, విశాఖపట్నంకు చెందిన జి.శారదా సుబ్రమణియన్ బృందం చక్కటి గానంతో భక్తి సంకీర్తనలు గానం చేసి సభికులను ఆకట్టుకున్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన 20 మందికిపైగా సంగీత కళా బృందాలు తమ దైన శైలిలో సుమధురంగా సంకీర్తనలను ఆలపించారు. అలాగే తిరుపతికి చెందిన కె.శ్రీదేవి శిష్యబృందం ప్రదర్శించిన ఉత్సవ సంప్రదాయ కీర్తనల నృత్యం ప్రత్యేకంగా ఆకట్టుకుంది. భక్తి సంకీర్తనలను రమణీయంగా గానం చేసి మెప్పించిన సంగీత కళాకారులను నిర్వాహకుడు పున్నమరాజు మురళీకృష్ణ శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఆరో రోజు శుక్రవారం అన్నమాచార్య పద కవితా గుభాళింపు పేరుతో గాత్ర సంగీత కచేరీలు నిర్వహించనున్నారు.

కార్మికులకు బీమా పాలసీతో భరోసా



మాట్లాడుతున్న కెశ్విన్ టీవీఎస్ షోరూం డీఎం వెంకటరమణ

తిరుపతి కల్చరల్: మెకానిక్ కార్మికులకు పోస్టల్ విభాగం రూ.10 లక్షలతో బీమాతో భరోసా ఇవ్వనున్నట్లు తిరుపతి టూ వీలర్స్ మెకానిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి తెలిపారు. తిరుపతి టూవీలర్స్ మెకానిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం గాంధీ భవన్ ఆవరణలో నెలవారీ అసోసియేషన్ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో రూ.10 లక్షల బీమా అందించేందుకు అసోసియేషన్ ముందడుగు వేసిందన్నారు. ప్రతి నెలా 30 మంది మెకానిక్ కార్మికులు చొప్పున 150 మందికి ఏడాదికి రూ.799 ఇన్సూరెన్స్ అసోసియేషన్ చెల్లిస్తుందని తెలిపారు. అనంతరం కెశ్విన్ టీవీఎస్ షోరూం డీఎం వెంకటరమణ మాట్లాడుతూ మెకానిక్‌లకు కొత్త ఎలక్ట్రిక్ వాహనాల ఫీచర్స్‌పై అవగాహన ఎంతో అవసరమన్నారు. తమ షోరూం ఆధ్వర్యంలో మెకానిక్ కార్మికులందరికీ కొత్త ఎలక్ట్రికల్ వాహనాలపై అనుభవజ్ఞులైన వారితో అవగాహన సదస్సుల ద్వారా శిక్షణ ఇస్తామని తెలియజేశారు. తిరుపతి టూవీలర్స్ మెకానిక్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు మల్లేశ్వరన్, కార్యదర్శి జలంధర్, ఉపాధ్యక్షుడు ప్రభు, సహాయ కార్యదర్శి గురు ఆచారి, కోశాధికారి బాబు, కమిటీ ఇన్‌చార్జ్ సోము, రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మణరావు, మెకానిక్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో ఆక్రమణల తొలగింపు

తిరుమల: తిరుమలలో నిబంధనలకు విరుద్ధంగా దుకాణదారులు ఏర్పాటు చేసుకున్న ఆక్రమణలను తిరుమల రెవెన్యూ విభాగం అధికారులు తొలగించారు. గురువారం సాయంత్రం స్థానిక హెక్గా కాంప్లెక్స్ దుకాణాల వద్ద ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, ఇతర దుకాణదారులు వాహన పార్కింగ్ ప్రదేశాన్ని ఆక్రమించి ఏర్పాటు చేసిన బెంచీలు, కుర్చీలను, ఫుట్‌పాత్‌లను తొలగింపజేశారు. ఈ సందర్భంగా దుకాణదారులకు తమకు కేటాయించిన స్థలంలోనే, అనుమతించిన ఉత్పత్తులనే విక్రయించాలని అధికారులు ఆదేశించారు.

జర జాగ్రత్త



పిల్లల సంతోషం కోసం తల్లిదండ్రులు నిబంధనలు అతిక్రమిస్తున్నారు. బైక్‌లపై ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. చిన్నపాటి ఆనందాల కోసం ప్రాణాల మీదకు తెచ్చుకునే విధంగా వ్యవహరించడం పరిపాటిగా మారుతోంది. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ జాగ్రత్తగా వాహనాలు నడపాలని పోలీసులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి





బడిఈడు పిల్లలంతా చదువుకోవాలి



నేను బడికి పోతా ర్యాలీలో ఎంఈఓలు మార్కండేయనాయుడు, జయవేలు, ఉపాధ్యాయులు

రామచంద్రాపురం: బడిఈడు పిల్లలందరూ పాఠశాలలకు రావాలని ఎంఈఓలు మార్కండేయనాయుడు, జయవేలు అన్నారు. గురువారం స్థానిక ఆర్సీపురం ఎస్టీకాలనీలో నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయుల నుంచి నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. 6 నుంచి 14 ఏళ్ల పిల్లందర్నీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. బడి మానేసిన పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించాలన్నదే నేను బడికి పోతా కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ప్రభుత్వ బడుల్లో చేరే విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యాభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వాగ్దేవి, ఉపాధ్యాయులు, సీఎంఈర్టీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగా దినచర్యలో భాగం కావాలి





మాట్లాడుతున్న యోగా రిటైర్డ్ ప్రొఫెసర్ గణేష్ శంకర్, హాజరైన విద్యార్థులు, అధ్యాపకులు

తిరుపతి సిటీ: మానసిక ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యం యోగాతోనే సాధ్యమని, యోగా ప్రతి వ్యక్తి దినచర్యలో భాగం కావాలని మధ్యప్రదేశ్ హరిసింగ్ గౌర్ యూనివర్సిటీ రిటైర్డ్ యోగా ప్రొఫెసర్ గణేష్ శంకర్ సూచించారు. గురువారం జాతీయ సంస్కృత వర్సిటీలో జరిగిన అంతర్జాతీయ యోగా సదస్సు ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ వ్యాధులు వచ్చినపుడు కాకుండా ఆరోగ్యంగా ఉన్నపుడే యోగా చేయడం అలవర్చుకోవాలన్నారు. ఇంద్రియ నిగ్రహం, మానసిక ప్రశాంతత, శారీరక దారుఢ్యం తదితర గొప్ప ప్రయోజనాలు యోగాతోనే సాధ్యమన్నారు. విశిష్ట అతిథి ఆర్‌ఎస్‌ఎస్ దక్షిణ మధ్య క్షేత్ర ప్రచారక్ ఎస్.భరత్‌కుమార్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన జీవనానికి యోగా ఓ దివ్య ఔషధమన్నారు. ఎస్వీ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రేణు దీక్షిత్ మాట్లాడుతూ ఆయుర్వేదం, యోగా పరస్పర సహకారంతో వ్యాధుల నివారణకు అవకాశం ఉందన్నారు. వీసీ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ యోగా శాస్త్రాన్ని పతాంజలి మహర్షి రచించారని, శారీరక, మానసిక, తార్కిక, ఆధ్యాత్మిక శక్తిని పెంపొందించేందుకు యోగా ఉపయోగపడుతుందన్నారు. నేపాల్ సంస్కృత వర్సిటీ ఇంటర్నేషనల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ప్రేమ్‌రాజ్ నౌపేయా, రిజిస్ట్రార్ రమాశ్రీ, డీన్ ప్రొఫెసర్ టి.రాఘవాచార్యులు, డాక్టర్ డి.జ్యోతి, డాక్టర్ ఆర్.లక్ష్మీనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ రక్షణ చట్టం తక్షణమే ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ఏపీ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు

తిరుపతి కల్చరల్: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఎన్‌డీఏ ప్రభుత్వం తక్షణమే బీసీల సంరక్షణ కోసం రక్షణ చట్టం అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా బీసీల అభివృద్ధికి నోచుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికీ బీసీల్లో అనేక కులాలు ఎదుగుదలకు నోచుకోలేదన్నారు. నూతన ప్రభుత్వం బీసీ ఉద్యోగులపై వివక్ష చూపడం దారుణమని, బీసీల ను ఒక పార్టీకి ఆపాదిస్తూ వారిపై కక్ష సాధింపు చర్యలకు పూనుకోవడం మంచిది కాదన్నారు. కక్ష సాధింపు చర్యలను వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి జిల్లాలో బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసి విద్యార్థులను పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. బీసీ హాస్టల్స్‌కు శాశ్వత భవనాలు ఏర్పాటు చేసి, హాస్టల్ విద్యార్థుల కాస్మోటిక్ చార్జీలు పెంచాలని, మంచి ఆహారం అందించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏపీ బీసీ విద్యార్థి సంఘం నేతలు షణ్ముగ పవన్‌కుమార్, భార్గవ్‌కుమార్, దాన్ ఎజ్రా, రామాంజి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం విజయవంతం



రక్తదాన శిబిరంలో స్విమ్స్ వీసీ ఆర్‌వీ కుమార్

తిరుపతి తుడా: శ్రీవేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్) బ్లడ్ బ్యాంక్ విభాగం ఆధ్వర్యంలో తిరుపతిలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అడ్మినిస్ట్రేషన్ ఆఫీస్‌లో గురువారం స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని విజయవంతం నిర్వహించినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగి దివంగత నేత తారకనాథ్ 20వ వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరాన్ని స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ ఆర్.వి. కుమార్ ప్రారంభించారు. కార్యక్రమలో స్విమ్స్ బ్లడ్ బ్యాంక్ విభాగాధిపతి డాక్టర్ శ్రీధర్‌బాబు పర్యవేక్షణలో బ్లడ్ బ్యాంక్ వైద్యులు, పారామెడికల్ సిబ్బంది పాల్గొని 104 మందికి బ్లడ్ గ్రూపింగ్ పరీక్షలు నిర్వహించారు. 81 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సురేష్ బాబు, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ ప్రశాంత్, టెక్నీషియన్ ఆర్.ఇ.పురుషోత్తంరెడ్డి, నర్సింగ్ సిబ్బంది, స్టూడెంట్స్‌తో పాటు నిర్వాహకులు ఎస్‌బీఐ యూనియన్ అమరావతి సర్కిల్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కె.వి.ఎస్.ఎన్. మూర్తి, వి.వి.ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్, కె.గిరిధర్, అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ, ఎం.వి.రాజు, అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ, డిప్యూటీ జనరల్ మేనేజర్ జి.లేఖ మీనన్ తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలి



చెత్త సేకరణను పరిశీలిస్తున్న అదితి సింగ్

తిరుపతి తుడా: నగరంలో ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలని.. సకాలంలో వాహనాలు చెత్త సేకరణకు వెళ్లాలని నగరపాలక సంస్థ కమిషనర్ అదితి సింగ్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం తెల్లవారుజాము నుంచి నగరంలో ఎయిర్ బైపాస్ రోడ్డు, ఎస్.జి.ఎస్. కాలేజీ రోడ్డు, ఆటోనగర్, చింతలచేను, ఉపాధ్యాయ నగర్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. ఇంటింటికీ రోజూ చెత్త సేకరణకు వాహనం వస్తోందా.. దుకాణాల వద్ద, ఇండ్ల వద్ద చెత్త కుండీలు ఉంచారా లేదా పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రతి రోజూ ఒకే సమయంలో చెత్త సేకరణకు వాహనాలు వెళ్లాలని, ప్రజల నుంచి తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలని అన్నారు. వీధుల్లో ఎక్కడా చెత్త వేయకుండా తమ సిబ్బందికి ఇచ్చేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డ్రైవర్లు జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు. వర్షాలు పడుతున్నాయని నగరంలో ఎక్కడా వర్షపు నీరు, మురుగునీరు ఆగకుండా ఇంజినీరింగ్, పారిశుధ్య సిబ్బంది ఓ అవగాహనతో పని చేయాలన్నారు. కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్‌వైజర్స్ చెంచయ్య, సుమతి, మేస్త్రీలు పాల్గొన్నారు.

సీమల్లవరంలో అవినీతిపై విచారణ జరపాలి



కంప్యూటర్ రశీదులు ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శితో టీడీపీ నేతల వాగ్వాదం

తిరుపతి రూరల్: ఇంటి పన్నులు, కుళాయి కనెక్షన్లకు నగదు వసూలు చేసి, రశీదులు ఇవ్వకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు సీమల్లవరం పంచాయతీలో భారీ అవినీతికి పాల్పడుతున్నారని గ్రామస్తులు ఆరోపించారు. గురువారం తిరుపతి రూరల్ మండలం సీమల్లవరం పంచాయతీ కార్యాలయం ఎదుట టీడీపీ పంచాయతీ అధ్యక్షుడు మనోహర్ చౌదరి ఆధ్వర్యంలో బాధితులు ఆందోళన చేపట్టారు. పంచాయతీలో అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి దాదాపు రూ.50 లక్షలకు పైగా అవినీతికి పాల్పడ్డారని, దాదాపు 180 మంది వద్ద పన్నులు వసూలు చేసినా పంచాయతీ ట్రెజరీలో జమ చేయకుండా స్వాహా చేశారని ఆరోపించారు. కంప్యూటర్ రశీదులు ఇవ్వకుండా, చేతి రాతతో రశీదులు ఇస్తున్నారని విమర్శించారు. జిల్లా కలెక్టర్ స్పందించి పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై పూర్తి స్థాయి విచారణ చేయాలని డిమాండ్ చేశారు.

ఉద్దేశపూర్వకంగానే ఆరోపణలు

ఎన్నికల ఫలితాల తర్వాత కొందరు పబ్లిసిటీ కోసం చౌకబారు ఆరోపణలు చేస్తున్నారని సర్పంచ్ మొక్కల భారతి టీడీపీ నేతల ఆరోపణలను ఖండించారు. పంచాయతీ పరిధిలోని ప్రజలు చెల్లించిన అన్ని పన్నులకు రశీదులు ఉన్నాయన్నారు. పంచాయతీ కార్యదర్శి సంతకం చేసి, సీలు వేసి ఇచ్చిన రశీదులు కూడా చెల్లవని మూర్ఖంగా వాదిస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి తాటాకు చప్పుడు బెదిరింపులకు భయపడబోయేది లేదని స్పష్టం చేశారు.